76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18

Dr. DWIBHASHYAM KASI VISHWANATH TEJASWI
ఏపీలో ప్రఖ్యాతిగాంచిన చింతలూరు ఆయుర్వేద వైద్యులు,
సంతానరాహిత్య సమస్యలకు సంప్రదించండి
ph : 90329 90138, 93939 90138
email :dr.d.vishwanath@gmail.com
AYYAPPA AYURVEDIC SYNDICATE
Visakhapatnam

# రాజధాని వార్తలు

Voice of Voiceless

రాజధాని వార్తలు దినపత్రికలో
పనిచేయుటకు సబ్ ఎడిటర్లు, రాష్ట్రవ్యాప్తంగా ఎడ్వటైజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, రిపోర్టర్‌లు కావలెను
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
76809 94755
rajadhanivartalu1@gmail.com

అమరావతి సంపుటి : 4 సంచిక 10, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 26 - ఆదివారం 2 డిసెంబర్, 2018

## అబ్బురపరుస్తున్న అమరావతి డిజైన్లు





సచివాలయం పైభాగం


అసెంబ్లీ ఆవరణలోని గ్యాలరీ


అమరావతిలో నిర్మించే సచివాలయం, టవర్లు, హైకోర్టు

తెలంగాణ శాసనసభ ఎన్నికలు

# ప్రత్యర్థులను కలవరపెడుతున్న తె.రా.స, మహా కూటమి ప్రచారాలు



**కాంగ్రెస్ శ్రేణులలో ఉత్సాహం నింపిన సోనియా రాహుల్ పర్యటన**

**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** తెలంగాణా శాసనసభ ముందస్తు ఎన్నికలకు నామినేషన్ల ఉపసంహరణ పర్వం ముగియడంతో ప్రధాన పార్టీలు తె.రా.స, మహాకూటమితో సహ అన్ని పార్టీలు డిసెంబరు ఏడున జరిగే ఎన్నికలకు పతాక స్థాయిలో ప్రచార వ్యూహాలను సిద్ధం చేసి రంగ ప్రవేశం చేసాయి. ఎన్నికల బరిలో అధికార తె.రా.సా; కాంగ్రెస్, తె.దె.పా, తె.జ.సా, సి.పి.ఐ పార్టీల మహాకూటమి; భారతీయ జనతా పార్టీ, ఎం.ఐ.ఎం, జనవాహిని తో సహ అనేక పార్టీలు బరిలో ఉన్నా పోటీ ప్రధానంగా తె.రా.సా, మహాకూటమి మధ్యనే ఉంటుంది. హైదరాబాదు పాత బస్తీలో ఎం.ఐ.ఎం మినహా మిగిలిన చోట్ల ఎన్ని పార్టీలు ఉన్నా, తె.రా.సా, మహాకూటమి మద్యే ప్రధాన పోటీ ఉంటుంది. వందకు పైగా నియోజకవర్గాలలో అభ్యర్థులను ప్రకటించిన భా.జ.పా ప్రభావం నామమాత్రమే. కేంద్రంలో అధికారంలో ఉన్నందున ప్రధాని మోడీ, భా.జ.పా అధ్యక్షుడు అమిత్‌షా, భా.జ.పా పాలిత రాష్ట్ర ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు ప్రచారంలో పాల్గొంటున్నా తెలంగాణా శాసనసభ ఎన్నికలకు భా.జ.పా నాయకత్వం ప్రాధాన్యం ఇవ్వలేదని స్పష్టంగా కనబడుతున్నది. తె.రా.సా, భా.జ.పాల మధ్య లోపాయికారీ అవగాహన ఉందనే ప్రచారానికి అనుగుణంగా భా.జ.పా ప్రవర్తిస్తున్నా ప్రతిపక్ష ఓట్లను చీల్చడం ద్వారా తె.రా.సాకు లాభం చేయగలిగిన పరిస్థితి కూడా భా.జ.పాకు ఉన్నట్లు కనబడదు. కేంద్రంలో అధికారంలో ఉండి ఒక రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో నామమాత్రపు పాత్ర వహించడం ఆశ్చర్యం కలిగించే విషయమే. ఇక అధికార తె.రా.సా. పరిస్థితి చూస్తే ముందస్తు ఎన్నికల ప్రకటన వచ్చినప్పటినుంచి ఊహించిన దాని కంటే ఎక్కువే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కో వలసి వచ్చింది. (రాహుగ్రస్త ముందస్తు అని రాజధాని వార్తలు ఇంతకు ముందు ప్రచు రించిన వార్తలాగానే-సంచిక 51) ముందస్తు ఎన్నికల ముందు తె.రా.సా పరిస్థితి గుర్తు తెచ్చుకుంటే ఇప్పుడు తె.రా.సా నాయకుల ప్రసంగాలు వారి ఆందోళనలను స్పష్టంగా సూచిస్తున్నాయి. సంక్షేమ రంగంలో దేశంలో కనీ వినీ ఎరుగని రీతిలో భారీ పథకాలు

- మిగతా 3 లో

## జనవరి 25న సిలికాన్ వ్యాలీ జీటెన్ ఆర్గనైజింగ్ సమావేశం



**రాజధాని వార్తలు, అమరావతి :** సిలికాన్ వ్యాలీ ఆధారిత గ్లోబల్ తమిళ్ ఎంటర్‌ప్రెన్యర్స్ నెట్వర్క్ (జీటెన్) జనవరిలో చెన్నైలో ఒక సమావేశాన్ని నిర్వహిస్తోంది. దీనిని జీటెన్ చెన్నై అని పిలుస్తారు. ఈ సమావేశం తమిళ నాడు ప్రభుత్వం నిర్వహించిన జిఎమ్ (గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్) తో కలిసి జరుగుతుంది. ఇది జనవరి 25 న జరుగుతుంది. జీటెన్ చెన్నై ప్రపంచ తమిళ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, పరిశ్రమ ప్రభావితదారులను మరియు ఆలోచన నాయకులు, సృజనాత్మకతలను కలిపిస్తుంది. జీటెన్ భాగస్వామ్యాలను సృష్టిస్తుంది. నేర్చుకోవడం, కమ్యూనిటీ ద్వారా ఆవిష్కరణలు, ఆలోచనలను భాగస్వామ్యం చేయడంలో గొప్ప విలువను అందిస్తుంది.

కాలిఫోర్నియాలో ఉన్న జీటెన్ చెన్నై కన్వీనర్లలో ఒకరైన నరసింహన్

- మిగతా 2 లో

## బ్యాంకులకు కుచ్చుటోపీ: సుజనాకు ఈడీ షాక్..



**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టిన కేసులో టీడీపీ రాజ్యసభ సభ్యుడు, చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన సుజనా చౌదరి చుట్టు ఉచ్చు బిగుస్తోంది. బ్యాంకుల ఫిర్యాదు మేరకు సుజనా చౌదరి కంపెనీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం దాడులు నిర్వహించింది. సుజనా చౌదరి విదేశాలకు వెళ్లకుండా లుకౌట్ నోటీసులు జారీచేసింది. అంతేకాకుండా ఈ నెల 27న తమ విచారణకు హాజరు కావాలని ఈడీ ఆదేశాలు జారీ చేసింది. సుజనా చౌదరి మొత్తం 120 డొల్ల కంపెనీలు సృష్టించి.. బ్యాంకుల నుంచి ఏకంగా రూ. 5,700 కోట్లు కొల్లగొట్టారని ఈడీ వెల్లడించింది. పలు విడతలుగా సుజనా కార్యాలయాలపై ఈడీ, సీబీఐ దాడులు జరిపింది. టీడీపీకి ఆర్థిక వనరుగా పేరొందిన సుజనా నిన్నమొన్నటివరకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగిన సంగతి తెలిసిందే. ఆయనపై ఇప్పటికే డీఆర్ఐ, ఫెమా, సీబీఐ కేసులు ఉన్నాయి. సుజనాకు బినామీ పేర్లతో ఉన్న ఫెరారీ, రేంజ్ రోవర్, బెంజ్ తదితర ఆరు కార్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నాగార్జున హిల్స్‌లో ఉన్న సుజనా కంపెనీపై, గత అక్టోబర్‌లోనూ ఆయన కంపెనీల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసి.. సుజనా చౌదరి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తన కంపెనీ ఉద్యోగులను డైరెక్టర్లుగా పెట్టి.. షెల్ కంపెనీలు ఆయన ప్రారంభించినట్టు తెలుస్తోంది. గంగా స్టీల్

- మిగతా 2 లో





వి సెంటర్
- మీటప్స్
- ఈవెంట్స్ • సమావేశాలు
- ట్రైనింగ్ • ప్రాడక్ట్ ఆవిష్కరణలు
- బుక్ రిలీజెస్ • మీడియా కన్సల్టింగ్
- సెమినార్స్ • మినీఫంక్షన్స్
- బ్రోచర్ లాంచింగ్
- అడ్వర్టయిజింగ్
- అడ్వైజరీ- మీడియా, ఐటీ, లీగల్, రియలెస్టేట్
- ఎన్నారై లయేజాన్
- ఆన్ డిమాండ్ సర్వీసెస్

VASTITUDE MEDIA PVT.LTD.
#40-5/6-8/1, Back side of Big- C Mobile show room, Opp: P&T Quarters, M.G.Road, Vijayawada - 520010
Ph: 7680994755, 9492298122, 7386000779




## ఆంధ్రప్రదేశ్ ముస్లిం, దూదేకుల పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడుగా దస్తగిరి ఏకగ్రీవ ఎన్నిక...



**రాజధాని వార్తలు, మందడం :** ఆంధ్రప్రదేశ్ ముస్లిం, దూదేకుల పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడుగా సీనియర్ జర్నలిస్ట్ దస్తగిరి ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడు దస్తగిరి మాట్లాడుతూ ముస్లిలు, దూదేకులు రాజకీయంగా సమాయత్తం కావాలన్నారు. రాజ్యాధికార సాధన కోసం మన యువత పోరాటం చెయ్యాలని, మనపై రాజకీయ పార్టీలు చూపిస్తున్న వివక్షతను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ముస్లింలు, దూదేకులు కేవలం ఓటు బ్యాంకే కాదని వివక్షత చూపిస్తే ప్రభుత్వాలను మార్చే సత్తా ఉందని నిరూపిద్దామన్నారు. మనమంతా ఏక తాటి పైకి రావాలి...మన హక్కులు మనం సాధించుకుందాం.కేవలం ఇప్పటి వరకు ఓటు బ్యాంకు గా చూసిన రాజకీయాపార్టీలు కూడా మాకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముస్లింలు, దూదేకులల్లో ఆర్థిక అసమానతలు తొలిగిపోవాలంటే మాకు తప్పక రాజకీయాప్రాధాన్యత ఇవ్వాలని పార్టీలు గ్రామ, మండలం, రాష్ట్ర స్థాయిలో ముస్లింలకు, దూదేకు ముస్లింలకు నామినెటెడ్ పోస్టులు ఇవ్వాలని, దశాబ్దాలుగా వెనకబడి ఉన్న దూదేకులకు బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించి వారి అభివృద్ధికి కృషి చెయ్యాలన్నారు. లేదంటే వచ్చె. ఎన్నికల్లో మా సత్తా ఏంటో చూపిస్తామన్నారు.

**డాక్టర్లు, లాయర్లలాగా ఇకపై ఉపాధ్యాయులు కూడా తమ వాహనాలపై ఈ లోగోను ముద్రించుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పిచ్చింది.**




## త్వరలో జనధ్వని పార్టీ ?



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** మాజీ ఐపీఎస్ లక్ష్మీనారాయణ ఏదో పార్టీలో చేరకుండా సొంత పార్టీ పెడతానని ప్రకటించాడు. దీనికి జనధ్వని అనే పేరు కూడా వినిపిస్తోంది. ఈయన సీబీఐలో మాజీ జేడీ కాబట్టి.. జేడీ లక్ష్మీనారాయణగా ఫేమస్ అయ్యాడు కాబట్టి.. జేడీ అనే సౌండ్ వచ్చేలా జనధ్వని అని పేరు పెడుతున్నాడట.

సూటిగా చెప్పాలంటే.. లక్ష్మీనారాయణ రాజకీయాల్లోకి వస్తున్నది, ఏకంగా సొంత పార్టీ అంటున్న దానికి కారణం.. ఈయన జగన్ పై నమోదైన క్విడ్ ప్రో కో కేసులను విచారించడం మాత్రమే. ఆ కేసుల విచారణతో.. ఒకవర్గం మీడియా చేత, ఒకవర్గం వారి చేత కీర్తింపబడ్డాడు.మరి అంతిమంగా

- మిగతా 2 లో




Gade Nageswara Rao
gade.nageswararao@gmail.com
cell : 9515153939
7901291111
SAI LASYA
REAL ESTATES & FINANCE CONSULTANCY
If you want to BUY/SALE OF
Agricultural Land, Houses, Sites and Appartments
VENKATAPALEM Village, Thulluru(m),Guntur (Dt.)


పెద్ద దిక్కు.. తీరని మొక్కు! 2 లో

వాళ్లు మనుషులు కాదు.. 3 లో



ముందు రోజు ఏం జరిగింది? 4 లో



ఆర్బీఐకి ఆద్యుడు అంబేద్కర్ 4 లో

# పెద్ద దిక్కు.. తీరని మొక్కు!

**రాజధాని వార్తలు కలం**

## 1992 నాటి పరిస్థితి పునరావృతం ?

లోక్ సభ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో రామ మందిర నిర్మాణానికి తేదీ ప్రకటించాలని శివసేన కేంద్రంపై ఒత్తిడి తెస్తూ, 1,50,000 మంది కార్యకర్తలతో నవంబరు 25న అయోధ్యలో ధర్మసభ నిర్వహిస్తామని చెప్పడం దేశ ప్రజలను కలవర పెడుతోంది. అదే సమయంలో అధికార బీజేపీలోని మతోన్మాదులు పెద్ద ఎత్తున వివాదాస్పద ప్రకటనలు ఇస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. (శనివారం సాయంత్రం) ఈ సంపాదకీయం రాస్తున్నప్పటికే దాదాపు 30 వేల మంది కరసేవకులు అక్కడకు చేరుకున్నారు. 144 సెక్షన్ విధించబడింది. అవసరమైతే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటామని మహారాష్ట్రలోని శివసేనకు చెందిన సీనియర్ నేత సంజయ్ రౌతాలా ప్రకటించగా, 1992 నాటి పరిస్థితి మళ్లీ పునరావృతం అవుతుందని ఆపార్టీ చట్టసభ ప్రతినిధి సురేంద్ర సింగ్ బాహాటంగా వెల్లడిస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ తెచ్చి రామమందిరాన్ని నిర్మించాలని వారు కోరుతున్నారు. వీరితోపాటు అనేక వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సాక్షి మహరాజ్ మాట్లాడుతూ ఢిల్లీలోని అతిపురాతన జామా మసీదును తవ్వితే ఖచ్చితంగా హిందూ దేవుళ్ల విగ్రహాలు దొరుకుతాయని చెబుతున్నారు. శివసేన కరసేవుకులు రామమందిరాన్ని విధ్వంసం చేసిన బాబర్ సామ్రాజ్యాన్ని నాశనం చేసినందునే బీజేపీ గద్దెనెక్కిందని ఉద్దవ్ ధాకరే ఉవాచిస్తున్నారు.

నిజానికి బాబ్రీ మసీదును నిర్మించింది శిథిలమైన జైన దేశాలయంపైన అని చరిత్రకారులు చెబుతున్నారు. బౌద్ధ ఆరామాలను నేలమట్టం చేసి దేశవ్యాప్తంగా శివాలయాలు నిర్మించింది మితవాదులు. అమరావతి, ఘంటసాల నుంచి ఢిల్లీ వరకు ఇదే నిజాన్ని వెల్లడిస్తున్నాయి. ఇప్పుడు ఈ ఆలయాలను తొలగించి బౌద్ధారామాలు కట్టడానికి ఆయా వర్గాలు సంసిద్ధత తెలుపుతాయా ? ముస్లింలు, క్రైస్తవులు ఎప్పుడూ వారి ఆలయాలను ఇతర మతాలయాలపై నిర్మించలేదు. దీనికి చారిత్రక సాక్ష్యాదారాలు ఉన్నాయి.

వాస్తవానికి బాబ్రీ విధ్వంసం లౌకికవాదులకు పీడకలలా వెంటాడుతూనే ఉంటుంది. రాజకీయాల్లో మతాలు ప్రవేశించి ప్రజల మధ్య విభజన చేపట్టి తద్వారా ఓట్లు రాబట్టి పదవులకు ఎక్కడాన్ని ఆ ఘటన రుజువు చేస్తుంది. మొదటి నుంచి దేశంలో కుల,మత తారతమ్యాలు ఉన్నప్పటికీ ప్రజల్లో రాజ్యాంగంపై గౌరవం, చట్టంపై భయభక్తులు ఉండేవి. అయితే బాబ్రీ విధ్వంసం అనంతరం మెజారిటీ వర్గాలదే పైచేయిగా నిలిచిపోగా, మైనార్టీలు అత్యంత అభద్రతకు లోనవ్వడం ే ప్రారంభం అయింది. బీజేపీ కురువృద్ధుడు అద్వానీ, మురళీమనోహర్ జోషి హిందువులందరినీ ఒకే తాటిపైకి తీసుకువస్తామంటూ రథ యాత్ర చేపట్టి హిందూ యువతను రెచ్చగొట్టి చేసిన దౌష్ట్యం అది. ఆ మతకలహాల్లో రెండువేల మంది చనిపోయారు. ఆ వేధనకు కోర్టులో ఇప్పటికీ ఉపశమనం కలగలేదు...ఇది అత్యంత వేధనా భరితం.. మనమంతా ఒకే జాతి, ఒకే మతం అంటూ ఆయా పార్టీలు దేశప్రజలందరినీ సమైఖ్యం చేయాల్సి ఉండగా, కలహాలు రేపి పదవులు పంచుకుంటున్న ఈ దుష్ట సంప్రదాయాన్ని ఇంకా కొనసాగించడం హేయం. ప్రజా సమస్యలు తీర్చే సత్తాలేక ఈ నాయకులంతా కుతంత్రాలు చేస్తున్నారని ప్రజలు గ్రహించాలి. ఇందుకు వ్యతిరేకంగా దేశప్రజలంతా ఒక్కటవ్వాలి.



**రాజధాని వార్తలు, అనంతపురం :** మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఏర్పాటైన సర్వజనాస్పత్రే జిల్లాకు పెద్దదిక్కు. పేదోడికి ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ఇక్కడికే పరిగెత్తుకు వస్తాడు. ఇక ప్రసవాల సంగతి సరేసరి. అందుకే ఓపీ రోజురోజుకూ పెరుగుతోంది. కానీ ఇక్కడ మౌలిక వసతులు లేక సరిపడా సిబ్బంది లేక జనం నరకం చూస్తున్నారు. ఇక పీజీ సీట్ల అనుమతులు, జీఓ 124 అమలు, ఎంసీహెచ్ బ్లాక్ కలగా మారడందో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

**నత్తనడకన సూపర్ స్పెషాలిటీ పనులు**

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు నత్తనడకనసాగుతున్నాయి. వాస్తవంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరైనా...టీడీపీ నేతలు మాత్రం తామే మంజూరు చేయించామని గొప్పలు చెబుతున్నారు. అయినా కూడా పనులపై దృష్టి సారించడం లేదు. అందువల్లే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు ఆగుతూ...సాగుతున్నాయి. 2014-15లో రూ.150 కోట్లతో ఆస్పత్రి ఏర్పాటుకు బీజం ఏర్పడింది. అందులో కేంద్ర ప్రభుత్వం రూ. 120 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్లు భాగస్వామ్యంతో ఆస్పత్రి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 2015-16లో పనులు ప్రారంభమయ్యాయి. 2017 డిసెంబర్‌కంతా పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ ఇంత వరకు పనులు పూర్తి కాలేదు. ఆస్పత్రి ఏర్పాటైతే కార్డియాలజీ, కార్డియో థొరాసిక్, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, యూరాలజీ, రేడియాలజీ, ప్లాస్టిక్ సర్జరీ తదితర సేవలతో పాటు 200 నుంచి 300 మందికి ఉపాధి దొరుకుంది. అంతటి ప్రాధాన్యం కలిగిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మరో ఐదారు నెలల్లో టీడీపీ సర్కార్ గడువు ముగియనుంది. మళ్లీ కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వం దృష్టి సారిస్తే సరి..లేదంటే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది. కనీసం టీడీపీ ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి.. దాదాపు 80 శాతం నిర్మాణపనులు పూర్తయిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తమ హయాంలోనే పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి చూపితే జిల్లా ప్రజలకు మేలు జరుగుతుంది..చరిత్రలో వారి పేరూ మిగులుతుంది. లేకపోతే ఎప్పటిలాగే జనం ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకూ కర్నూలు, విజయవాడ, హైదరాబాద్, బెంగళూరుకు పరుగులు తీయాల్సి వస్తుంది.

**బాలింతలకు తప్పని నరకం**

సర్వజనాస్పత్రిలో అవుతున్న ప్రసవాలకు, పడకలకు పొంతన కుదరడం లేదు. అయినప్పటికీ ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లలేని నిరుపేదలంతా సర్వజనాస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకుంటున్నారు. ఇలా సిజేరియన్ చేయించుకుంటున్న వారిని కనీసం వారం రోజుల పాటు గైనిక్ వార్డులో ఉంచుతారు. అయితే పడకలు తక్కువగా ఉండడంతో ఒకే మంచంపై ముగ్గురు పడుకోవాల్సి వస్తోంది. దీంతో బాలింతలు కదలకుండా పడుకోవాల్సిన పరిస్థితి. మరోవైపు తమ చిన్నారులు ఎక్కడ పడిపోతారో..? కుట్లు ఎక్కడ ఊడిపోతాయోమోనని భయాందోళనలు చెందుతున్నారు. ఈ క్రమంలోనే వారు నరకం చూస్తున్నారు. ఆస్పత్రికి ఎంసీహెచ్ బ్లాక్ మంజూరైనా అది హిందూపురం జిల్లా ఆస్పత్రికి వెళ్లింది. ప్రస్తుతం ఆస్పత్రి యాజమాన్యం కలెక్టర్ ద్వారా రూ.55 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపింది. కానీ ఇంతవరకూ అతీగతీ లేదు. ప్రస్తుతం గైనిక్ విభాగంలో 60 పడకలు మాత్రమే మంజూరైనా... 250 మంది అడ్మిషన్‌లో ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

**పీజీ సీట్లు లేక ఇబ్బందులు**

బోధనాస్పత్రి ఏర్పడి 18 ఏళ్లు గడుస్తున్నా.. పీజీ సీట్లు లేకపోవడంతో వైద్యులపై అదనపు భారం పడుతోంది. పొరుగున ఉన్న కర్నూలు జిల్లాలోని ఏ ప్రైవేటు మెడికల్ కళాశాల ఏర్పడి ఎనిమిదేళ్లు కాకముందే పీజీ సీట్లు సంపాదించుకోగలిగింది. కారణం ఆ యాజమాన్యం పీజీ సీట్లకోసం పట్టుబట్టి సాధించుకుంది. మన జిల్లా నుంచి ఎన్నికైన వారిలో ఎక్కువ మంది టీడీపీ వారే అయినా... ఎప్పుడు ఇద్దరు కేబినెట్‌లో ప్రాతినిథ్యం వహిస్తున్నప్పటికీ పీజీ సీట్లు సాధించడంలో వారంతా ఘోరంగా విఫలమయ్యారు. ఎప్పుడో ఒకసారి ఆస్పత్రికి వచ్చి తనిఖీల పేరుతో హడావిడి చేయడం తప్ప నిజంగా చిత్తశుద్ధితో వారు ప్రయత్నించింది శూన్యమనే చెప్పాలి. ఇప్పటికైనా వారు కళ్లు తెరిచి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పీజీ సీట్లు మంజూరు చేయించడంతో పాటు ఎంసీహెచ్ బ్లాక్, జీఓ 124 అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉంది. అదే జరిగితే జీఓ 124 ద్వారా 649 పోస్టులు మంజూరవుతాయి. దీని ద్వారా రోగులకు మరింత మెరుగ్గా సేవలదించేందుకు వీలుగా ఉంటుంది.

**నరకం చూశా**

మూడ్రోజులుగా గైనిక్ వార్డులో ఉంటున్నాం. మంచాలు చాలడం లేదు. ఒకే మంచంపై ముగ్గురు పడుకుంటున్నాం. రాత్రి వేళల్లో కదిలేందుకు వీలుండదు. ఎక్కడ పడిపోతామోనన్న భయం. కుట్లు ఊడి మరింత ఇబ్బంది అవుతుందని కదలకుండా ఉంటూ నరకం చూస్తున్నామని రోగులు చెప్తుతున్నారు.

## 40 వేల మందిని బాబు వంచించాడు: విజయసాయి రెడ్డి



**హైదరాబాద్ :** ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడిపై వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి మరోసారి ట్విటర్‌లో ఛలోక్తులు విసురుతూ తనదైన శైలిలో విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తామంటూ నాయుడు బాబు తాను ఇచ్చిన హామీకి మంగళం పాడేశారని మండిపడ్డారు. నాలుగున్నరేళ్లపాటు కమిటీలు, ఉపసంఘాలు అని మభ్యపెట్టి 40 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను దారుణంగా వంచించారని తూర్పారబట్టారు. అలాగే ఏపీ నూతన రాజధాని అమరావతి డిజైన్ల విషయంలో చంద్రబాబు తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. 'అసెంబ్లీ భవనం డిజైన్ ఇడ్లీ స్టాండ్‌లా కనిపిస్తోందని విమర్శలు రావడంతో దానిని బోర్లించిన లిల్లీ ఆకృతిలోకి మార్చారంట. నాయుడు బాబు చెబుతున్న నయా తాజ్‌మహల్ ఇదేనేమో. తాజ్‌ని తలదన్నేలా కట్టినా తాజ్ చారిత్రక విశిష్టతను ఏదీ అధిగమించలేదన్న ఇంగితం లేదాయె! ' అంటూ చంద్రబాబు నుద్దేశించి తీవ్రంగా ధ్వజమెత్తారు.

## సీఆర్డీఏ హ్యాపీనెస్ట్ ప్రైవేట్ రియల్టర్లకు సవాల్



**రాజధాని వార్తలు, అమరావతి :** క్యాపిటల్ రీజినల్ డెవలప్మెంట్ అథారిటీ (సిఆర్డిఎ) హ్యాపీ నెస్ట్ ప్రాజెక్ట్ ఫ్లాట్ల అమ్మకం ఆఫర్ అనేక టాప్ ఇన్ఫ్రా కంపెనీలు,ప్రైవేట్ స్థానిక రియాల్టీ సంస్థలు కొనసాగిస్తున్న ప్రాజెక్టులకు ఒక పీడకల గా మారినది. ఇటీవలే ఆన్లైన్ అమ్మకాలలో ఓపెన్ మార్కెట్లో సి.ఆర్.డి. చదరపు అడుగు రూ. 3,499 చొప్పున అమ్మింది . అనేక టాప్ ఇన్ఫ్రా కంపెనీలు రూ. 5000 చదరపు అడుగులు చొప్పున అమ్ముతున్నాయి

ఇప్పటికే అనేక ప్రముఖ ఇన్ఫ్రా కంపెనీలు హైదరాబాదు నుండి అమరావతికి తమ కార్యకలాపాలను మార్చాయి. రాష్ట్ర విభజన తర్వాత విజయవాడ, గుంటూరు నగరాల పరిమితిలో బహుళ అంతస్థుల నివాస సముదాయాలు ప్రారంభించాయి. వారు రెండు సంవత్సరాల నుండి వినియోగదారుల కోసం వేచి ఉన్నారు. సీఆర్డీఏ మార్కెట్లో చేరడంతో, మద్దతులేని మార్కెట్ పరిస్థితుల కారణంగా బిల్డర్లు బాధపడుతున్నారు.

అధికారులు, రియాల్టీ కంపెనీ యాజమాన్యాల ప్రకారం, విజయవాడ, గుంటూరు నగరాల పరిమితిలో దాదాపు ఒక లక్షల ఫ్లాట్లు నిర్మించబడుతున్నాయి. వివిధ సంస్థల మొత్తం నిర్మాణ ప్రాంతాల్లో కేవలం 10 శాతం మాత్రమే విక్రయించబడుతున్నాయి. వ్యాపారంలో తిరోగమనం కారణంగా టాప్ ఇన్ఫ్రా కంపెనీలు ప్రభుత్వ మద్దతుతో ఐటి కంపెనీలకు తమ ప్రాజెక్టులను లీజుకు ఇచ్చాయి. హైదరాబాద్‌కు చెందిన డజనుకు నిర్మాణ సంస్థలు ప్రస్తుతం విజయవాడ, గుంటూరు నగరాల్లో తమ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి బిజీగా ఉన్నాయి. సీఆర్డీఏ నుండి అని ప్రైవేట్ కంపెనీలు పోటీని ఎదుర్కొంటున్నాయి. రైతుల నుండి భూములను సేకరించినందున, సీఆర్డీఏ అమరావతి రాజధాని ప్రాంతంలో గణనీయమైన భూభాగాన్ని కలిగి ఉంది. ఈ నేపథ్యంలో, ప్రతి చదరపు అడుగుల రూపాయలు 3,500 రూపాయలకు అందజేయగలదని హైదరాబాదుకు చెందిన నిర్మాణ సంస్థ ప్రతినిధి కొమ్మరెడ్డి శ్రీనివాస రావు అన్నారు. సీఆర్డీఏ హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుతో పోటీ చేయమన్నారు. మార్కెట్ నిరుత్సాహపడటంతో, సీఆర్డీఏ ప్రాజెక్ట్ ప్రైవేట్ సంస్థలకు సవాలుగా మారిందన్నారు. సిఆర్డీఏ ఆన్లైన్లో వేలం ద్వారా మొదటి దశలో 300 ఫ్లాట్లను విక్రయించింది. త్వరలో మరో 900 ఫ్లాట్లను విక్రయించడానికి సిద్ధంగా ఉంది. ఇది వేలం మొదటి రెండు దశల పూర్తి తరువాత మరో 1200 ఫ్లాట్ల విక్రయించడానికి ప్రణాళికలు తయారు చెస్తోందని ఆయన తెలిపారు.

## బ్యాంకులకు కుచ్చుటోపీ : సుజనాకు ఈడీ షాక్..

(మొదటిపేజీ తరువాయి)

ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేటు లిమిటెడ్, భాగ్యనగర్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్, తేజస్విని ఇంజినీరింగ్ ప్రైవేటు లిమిటెడ్, ఫ్యూచర్ టెక్ ఇండస్ట్రీస్ తదితర డొల్ల కంపెనీలకు ఆయన పెద్ద ఎత్తున డబ్బు తరలించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

ఎలాంటి కొనుగోళ్లు చేయకుండానే.. కేవలం రశీదుల రూపంలో భారీగా డబ్బుగా మళ్లించినట్టు ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో 2017 ఫిబ్రవరి, 2018 జులైలో మరోసారి ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసింది. గత అక్టోబర్‌లో ఈ కేసులకు సంబంధించి పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకుంది. ఇక, మూడు బ్యాంకుల నుంచి రూ. 304 కోట్ల రూపాయల రుణం తీసుకొని.. వాటిని దుర్వినియోగపరిచినట్టు ఈడీ అభియోగాలు నమోదు చేసింది. ఆంధ్రా బ్యాంకు నుంచి రూ. 304 కోట్లు, కార్పొరేషన్ బ్యాంకు నుంచి రూ. 120 కోట్లు, సెంట్రల్ బ్యాంకు నుంచి రూ. 124 కోట్లు సుజనా అప్పుగా తీసుకొని.. చాలావరకు నిధులను డొల్ల కంపెనీలకు తరలించారని ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. బ్యాంకుల ఫోరెన్సిక్ ఆడిటింగ్‌లోనూ ఈ విషయం తేటతెల్లమైంది. ఆయన బినామీ కంపెనీలు కేవలం రశీదులు రూపొందించి డబ్బు తరలించుకుపోయినట్టు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. గత మూడేళ్లుగా సాగుతున్న ఈ విచారణ ప్రస్తుతం కీలకదశకు చేరుకున్నట్టు తెలుస్తోంది.

## త్వరలో జనధ్వని పార్టీ ?

(మొదటిపేజీ తరువాయి)

సాధించింది అయితే కొండను తవ్వి ఎలుకను పట్టడమే. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జగన్ పైనా, ఆయన వ్యాపార భాగస్వామ్యుల పైన నమోదైన అభియోగాల్లో చాలావరకూ వీగిపోయాయి. రాజకీయ పార్టీ అన్నాకా ఓటర్లందరినీ టార్గెట్ చేస్తుంది అంటారా, జేడీ రాజకీయాల్లోకి వచ్చిన రూటును బట్టిచూస్తే.. ఈయనకు అందరినీ ప్రభావితం చేసేంత శక్తియుక్తులు లేవు. జగన్ వ్యతిరేకుల చేత మొదటి నుంచి లక్ష్మీనారాయణ కీర్తనలు అందుకొంటూ ఉన్నాడు. వారే ఈయనకు ఫ్లెక్సీలు వేశారు.ఇప్పుడు ఓట్ల విషయంలో కూడా వారి మీదే ఆధారపడాలి. ఇది అటు తెలుగుదేశం పార్టీకి ఇటు పవన్ కల్యాణ్‌కు ఇబ్బందికరమైన అంశమే. ఎందుకంటే.. టీడీపీ ఆశలు జగన్ వ్యతిరేకుల మీదే.పవన్ కల్యాణ్ కూడా జగన్ వ్యతిరేకులను తనవైపుకు తిప్పుకునే యత్నంలో ఉన్నాడు. ఇక ఈ జేడీ ఉనికి మొదలైందే జగన్ వ్యతిరేకుల ద్వారా. ఇలా ఉన్న వారే జగన్ వ్యతిరేకత మీద ఆధారపడితే, వస్తున్న వాళ్లు కూడా ఆ ఓట్లనే చీల్చుకోవడం ఆసక్తిదాయకం.

## శ్రీకాకుళం జిల్లాలోకి ప్రజాసంకల్పయాత్ర



**రాజధాని వార్తలు, విజయనగరం :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర 305వ రోజు శ్రీకాకుళంలోకి ప్రవేశించారు. రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్న చంద్రబాబు పాలనను తుదముట్టించేందుకు, ప్రజల సమస్యలు తెలుసుకుని వారికి నేనున్నానంటూ భరోసానిస్తూ.. 12 జిల్లాల్లో 124 నియోజకవర్గాల్లో అలుపెరుగని విక్రమార్కుడిలా పాదయాత్రను కొనసాగించిన జననేత వైఎస్ జగన్ ఆదివారం శ్రీకాకుళం జిల్లాలోకి అడుగెడుతున్నారు. ఈ జిల్లాల్లో రాజన్న తనయుడి పాదయాత్ర 10 నియోజకవర్గాలు మీదుగా సుమారు 350 కిలోమీటర్లు సాగనుంది. కురుపం నియోజకవర్గం తురకనాయుడు శివారు నుంచి వైఎస్ జగన్ పాదయాత్రను ప్రారంభి, అక్కడి నుంచి నగురు, దట్టివలస క్రాస్ రోడ్డు, చిలకం క్రాస్ రోడ్డు, రావివలస క్రాస్ రోడ్డు మీదుగా.. శ్రీకాకుళం జిల్లా పాలకొండ నియోజకవర్గంలోకి ప్రవేశిస్తారు. అక్కడి నుంచి కెల్ల, నడిమికెల్ల వరకు వైఎస్‌జగన్ పాదయాత్ర కొనసాగనుంది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం ఓ ప్రకటన విడుదల చేశారు. తమ సమస్యలను తెలుసుకునేందుకు జిల్లాకు వైఎస్ జగన్‌కు ఘనంగా స్వాగతం పలికేందుకు శ్రీకాకుళం జిల్లా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సమాయత్తం అవుతున్నారు.

## బస్సులో రంపచోడవరానికి పవన్..



**రాజధాని వార్తలు, రాజమహేంద్రవరం :** తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో ఉన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆర్టీసీ బస్సులో రంపచోడవరం పయనమయ్యారు. నీటిపారుదల ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు, ఏజెన్సీ గిరిజనుల స్థితిగతులను తెలుసుకొనే దిశగా తన రాజమహేంద్రవరం నుంచి బస్సు ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. మధ్యాహ్నం రాజమహేంద్రవరంలో బయల్దేరిన ఆయన గుడాల, కోరుకొండ, గోకవరం మీదుగా రంపచోడవరానికి చేరుకోనున్నారు. ఈ ప్రయాణంలో పలు గ్రామాల్లో గిరిజనులతో పవన్ మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. అనంతరం రంపచోడవరంలో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. బస్సు ప్రయాణంలో ఆయన వెంట సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో పాటు జనసేన నేత, మాజీ మంత్రి బాలరాజు తదితరులు ఉన్నారు.

## సీబీఐ ప్రవేశ నిషేదం సరైన చర్యే : చంద్రబాబు



**రాజధాని వార్తలు, అనంతపురం :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి సీబీఐపై అక్కసు వెళ్లగక్కారు. రాష్ట్రంలో సీబీఐ ప్రవేశాన్ని నిరాకరించడం సరైన చర్యే అంటూ తనను తాను సమర్థించుకున్నారు. సీబీఐ, ఈడీ సంస్థలు కలుషితమైయ్యాయని ఆరోపించారు. శనివారం అనంతపురంలో ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు.ఎన్డీయే ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వల్ల ఎవ్వరికి చిల్లిగవ్వ ఉపయోగం లేదన్నారు. దేశ ప్రయోజనాల కోసమే 35 ఏళ్ల పాటు వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తున్నామని చెప్పుకొచ్చారు.

**కేసీఆర్ ప్రతి రోజు నన్నే తిడుతున్నారు**

'కేసీఆర్ ప్రతి రోజు నన్ను తిడుతున్నారు..హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినందుకా నాపై విమర్శలు' అని చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానన్న సోనియాగాంధీ హామీని స్వాగతిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఎన్నికల్లో టీడీపీతో పొత్తు ఉండదని బీజేపీ ఏకపక్షంగా ప్రకటించిందని.. అందుకే కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకున్నామని చంద్రబాబు వివరించారు.

## మజ్లిస్‌కు గొడుగు పట్టాల్సిందే : అక్బరుద్దీన్



**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** మజ్లిస్ పార్టీ తలచుకుంటే ఎవరినైనా సీఎం పీటం పై కూర్చోబెడుతుందని ఆ పార్టీ నేత చాంద్రాయణగుట్ట తాజా మాజీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ. హైదరాబాద్‌లో యాకుత్‌పురాలో ఆయన ఓ సభలో ప్రసంగిస్తూ వైయస్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ ఇలా ఎవరైనా సరే మజ్లిస్‌కు గొడుగు పట్టాల్సిందే అని వ్యాఖ్యానించారు. డిసెంబర్ 11 తర్వాత మజ్లిస్ పవర్ ఏమిటో ప్రపంచానికి చూపిస్తామని అక్బరుద్దీన్ అన్నారు. రాజకీయ నేతను కాదని, పొలిటికల్ కింగ్‌నని చెప్పుకున్నారు. అక్బరుద్దీన్ ఓవైసీ. కొద్ది రోజుల క్రితం అక్బరుద్దీన్ సోదరుడు అసదుద్దీన్ నిర్మల్‌కు ప్రచారానికి రాకపోతే కాంగ్రెస్ రూ.25 లక్షలు ఇస్తామంటూ కాంగ్రెస్ నేత మాట్లాడిన ఆడియో టేపులను విడుదల చేసి సంచలనం సృష్టించారు. ఇప్పుడు అక్బరుద్దీన్ కూడా సంచలన వ్యాఖ్యలు చేయడంతో తెలంగాణలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. అక్బరుద్దీన్ ప్రస్తుతం చాంద్రాయణగుట్ట నుంచి బరిలో నిలుస్తున్నారు. ఆయనపై పోటీకి కాంగ్రెస్ నుంచి ఈసా మిస్రీ బరిలోకి దిగుతున్నారు. ఇదిలా ఉంటే అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై బీజేపీ నేత ఇంద్రసేనా రెడ్డి స్పందించారు. మజ్లిస్ నేత కేసీఆర్‌తో పొత్తుతో ఉన్నారని అన్నారు. హిందూ సమాజాన్ని భయపెట్టి లొంగదీసుకోవాలనే ప్రయత్నం అక్బరుద్దీన్ చేస్తున్నారని ఇంద్రసేనా రెడ్డి అన్నారు. హిందూ ముస్లింల మధ్య గొడవపెట్టి విడగొట్టాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో కూడా చంద్రబాబును కాంగ్రెస్‌ను మజ్లిస్ పార్టీ లొంగదీసుకుందని, కేసీఆర్ విషయంలో కూడా అదే జరిగిందన్నారు. తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారన్న ఆయన తగిన గుణపాఠం చెబుతారన్నారు.

## తెలంగాణాలో టైమ్స్ నౌ సర్వే ఫలితాలు

**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయ పరిస్థితిపై టైమ్స్ నౌ సర్వే ఆసక్తిదాయకంగా ఉంది. జరగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి పరిపూర్ణ మెజారిటీని సాధిస్తుందని ఈ సర్వే అంచనా వేసింది. ఈ ఎన్నికల్లో తెరాస కనీసం డెబ్బై స్థానాలను సాధించడం ఖాయమని ఈ సర్వే అభిప్రాయపడింది.

ఈ విధంగా కేసీఆర్ పార్టీ మినిమం మెజారిటీని సాధిస్తుందని ఈ సర్వే పేర్కొంది. అదే మహాకూటమి విషయానికి వస్తే కాంగ్రెస్, టీడీపీలు చేతులు కలిపినా.. తెలంగాణ జనసమితి, సీపీఐలు తోడు వచ్చినా వాళ్లకు వచ్చేది ముప్పై మూడు సీట్లు మాత్రమే అని ఈ సర్వే పేర్కొంది. విశేషం ఏమిటంటే.. గత ఎన్నికల్లో కంటే టీఆర్ఎస్ కు సీట్లు పెరుగుతాయి. మహాకూటమిలోని పార్టీలు సోలోగా సాధించిన సీట్ల కంటే ఈసారి తగ్గుతాయని ఈ సర్వే పేర్కొనడం. గత ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీలు వేర్వేరుగా పోటీచేసి ముప్పై ఆరు సీట్లను సాధించుకున్నాయి. అయితే ఈసారి మాత్రం ఇద్దరూ కలిసి ముప్పై మూడు సీట్లకు పరిమితం అవుతారని టైమ్స్ నౌ సర్వే విశ్లేషించింది. కాంగ్రెస్, టీడీపీ చేతులు కలపడాన్నిఓటర్లు స్వాగతించడం లేదని.. ఈఅంశంలో యాభై శాతానికి పైనే వ్యతిరేకత వ్యక్తం చేశారని ఈఅధ్యయనం వివరించింది. కూటమిలో ఎవరిది పైచేయి కాంగ్రెస్‌దేఅని ఈ సర్వే వివరించింది. కాంగ్రెస్ ముప్పై ఒక్క సీట్లు సంపాదించుకోవచ్చని.. టీడీపీ కేవలం రెండు సీట్లలో మాత్రమే నెగ్గేఅవకాశం ఉందని పేర్కొంది. ఎంఐఎం ఎనిమిది సీట్లలో బీజేపీ మూడు ఇతరులు ఐదు సీట్లలో నెగ్గే అవకాశం ఉందని ఆ సర్వే వివరించింది.



**ఆంధ్రప్రదేశ్ సచివాలయం 2వ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో గౌ"గిరిజన సంక్షేమ మరియు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ కిడారి శ్రావణ్ కలిసిన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుండి వెస్ట్ బెర్రీ స్కూల్ డైరెక్టర్ మహేష్ కుమార్ స్కూల్ ఉపాధ్యాయులు , విద్యార్థులు**



# వాళ్లు మనుషులు కాదు.. !

**మనిషనేవాడుంటే మతాలు ఉంటాయి. మతాలకోసం హింసను ప్రేరేపిస్తూ, క్రూరంగా ప్రవర్తించేవారు మానవ మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నారు. బీజేపీ పాలనలో హీన సంస్కృతి పెరిగింది. మతం పేరుతో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు, అత్యాచారాలను జరుపుతూ జన్మనిచ్చిన తల్లినే అవమానిస్తున్నారు. నిందితులను నిలదీసిన వారిని హత్యచేస్తామని బెదిరిస్తున్నారు. దేశం కన్నీరుపెట్టిన కథువా సంఘటనలో సామూహిక అత్యాచారానికి, పైశాచికత్వానికి బలైన ఎనిమిదేళ్ల చిన్నారి అసిఫా తరుపున వాదిస్తున్న లాయర్ దీపికారజావత్‌కు రోజూ బెదిరింపులే..**






ఆమె

ప్రతి మనిషికి సామాజిక బాధ్యత అనేది ఒకటుంటుంది. పోలీసులు, టీచర్లకు, డాక్లర్లు,లాయర్లు, జర్నలిస్టులు వంటి వృత్తిదారులకు ఈ బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుంది. అయితే సమాజం భయంకర దౌర్జన్యపూరిత వాతావరణంలోకి నెట్టబడటంతో వారి వృత్తులకు చాలా మంది న్యాయం చేయలేకపోతున్నారు. మనస్సాక్షిన చంపుకోలేక ముందుకొచ్చిన వారికి అడుగడుగునా అవరోధాలు, బెదిరింపులు స్వాగతం చెబుతున్నాయి.

సంప్రదాయక కశ్మీరీ పండిట్ కుటుంబంలో జన్మించిన దీపికా.. పేదల కోసం వాయిస్ ఫర్ రైట్స్ ఎన్‌జీవో సంస్థను నడుపుతున్నారు. ఈమె ఓ గిరిజన తెగకు చెందిన ముస్లిం బాలిక అసిఫా తరపున వాదించడమేమిటని కొంతమంది అసహ్యించుకుంటే... మరికొంత మంది ఇంకో అడుగు ముందుకేసి దీపికను, ఆమె కూతురిని అత్యాచారం చేసి చంపేస్తామని బెదిరిస్తున్నారు. ఈ కేసు నుంచి తప్పుకోకపోతే కుటుంబాన్ని అంతమొందిస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయితే దీపికా ఈ బెదిరింపులకు ఏమాత్రం లొంగడం లేదు. " ప్రతీరోజూ ఇంటికి చేరుకోగానే మెయిన్ గేటు నుంచి ఇంట్లో వరకు గల పరిసరాలన్నింటినీ ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుంటాను. నా కూతురు, భర్త గురించి ఏ క్షణాన... ఏ చేదు వార్త వినాల్సి వస్తుందోనని ఆందోళనకు గురవుతాను. కథువా ఘటన జరిగి 10 నెలలు గడిచిపోయింది. విచారణ కొనసాగుతోంది. నా అభ్యర్థనను మన్నించి రాష్ట్ర ప్రభుత్వం నా ఇంటి చుట్టూ పోలీసు కాపలా ఏర్పాటు చేసింది. అయితే ఒకటి మాత్రం నిజం..వాళ్లు సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నారు. అది నాకు తెలుసు.. అయినా నేను మాత్రం ఈ కేసును విడిచిపెట్టే ప్రసక్తే లేదు' అంటూ వోగ్ క్రూసేడర్ ఆఫ్ ది ఇయర్-2018గా ఎంపికైన దీపికా రజావత్ స్పష్టం చేశారు.

"అత్యంత పాశవికంగా సామూహిక అత్యాచారానికి గురైన ఎనిమిదేళ్ల చిన్నారి అసిఫా బానో చనిపోయే ముందు ఎంత నరకయాతన అనుభవించిందో ఓ మహిళకు, తల్లిగా నేను అర్థం చేసుకోగలను. మానవ హక్కుల కార్యకర్తగా, ఓ న్యాయవాదిగా బాధితుల తరపున పోరాడాల్సిన బాధ్యత నాపై ఉంది. అందుకే ఈ కేసు వాదించేందుకు నాకు నేనుగా ముందుకు వచ్చాను. ఈ కారణంగా నా తల్లిదండ్రులు కూడా చాలా వేధింపులు ఎదుర్కొన్నారు. నన్నో జాతి వ్యతిరేక శక్తిగా నాపై ముద్ర వేసినపుడు వారి బాధ వర్ణనాతీతం. నా తోటి న్యాయవాదులు కూడా నా పట్ల ఇదే భావన కలిగి ఉండటం నన్ను మరింతగా బాధిస్తోంది. కాని ఇప్పుడిప్పుడే వారిలో కాస్త మార్పు కప్పిస్తోంది. కానీ అది నిజమైనదో కాదో పోల్చుకోలేకపోతున్నాను అంటున్నారామే.. ఏది ఏమైనా నిందితులకు శిక్షపడేలా ఆమెకు నైతిక మద్దతు అందచేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

## కాలమ్

### చలికి వందనం

అందరికీ సంస్కారం నేర్పింది....

- పురుషులు చాలా ఒద్దికగా చేతులు కట్టుకుని ఉంటున్నారు.
- స్త్రీలు నిండుగా చెంగు కప్పుకుంటున్నారు.
- అందరూ తొందరగా ఇంటికి వస్తున్నారు.
- వేడిగా తినాలని త్వరగా భోజనాలు చేసి ముసుగు కప్పుకుంటున్నారు.
- రోడ్లుపై యువకుల సంచారం కూడా తగ్గి రోడ్లకు రెస్ట్ ఇచ్చారు.
- ఫ్యాన్స్, ఏసీ లు వేయకుండా కరెంట్ ఆదా చేస్తున్నారు.
- అందరికి సంస్కారం నేర్పుతున్న చలికి నమస్కారం



## వేల్పుల లక్ష్మీశ్రీజ యాదవ్‌కు అభినందనలు

**లక్ష్మీశ్రీజకు రాజ్యాంగం కంఠతా**



**హైదరాబాద్ :** భారత రాజ్యాంగ ప్రవేశిక మొదలుకొని ఐదు భాగాల్లో ఉన్న 395 అధికరణలను చదవడానికి ఒక రోజు సరిపోదు అలాంటిది ఒక గంట సమయంలోనే మొత్తం ఆ బాలిక కంఠతా చెప్పేసింది. తెలంగాణలోని ఖమ్మంకు చెందిన పదేళ్ల బాలిక వేల్పుల లక్ష్మిశ్రీజ అసాధారణ ప్రతిభ ఇది. తెలంగాణ శాసనసభాపతి మధుసూదనాచారి కార్యాలయానికి తల్లిదండ్రులు సుధారాణి, కిరణ్‌కుమార్‌తో కలిసి ఆమె వచ్చింది. అక్కడ లక్ష్మిశ్రీజ రాజ్యాంగాన్ని ఏకబిగిన చెప్పేసింది. ప్రముఖులు ఏ అధికరణ గురించి అడిగినా వివరించింది. ఆమె జ్ఞాపకశక్తి అసాధారణమని, తెలంగాణ ఖ్యాతిని ఆమె ప్రపంచానికి తెలియజేస్తుందని దేశానికి గర్వకారణంగా నిలుస్తుందని ఈ సందర్భంగా మధుసూదనాచారి ప్రశంసించారు.

## జనవరి 25న సిలికాన్ వ్యాలీ జీటెన్ ఆర్గనైజింగ్ సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

కస్తూరిరంగన్ మాట్లాడుతూ, విజయవంతమైన కమ్యూనిటీ వ్యవస్థాపకుల నుండి కీలకమైన గమనికలు, ప్యానెల్ చర్చలు మరియు గురువు కనెక్ట్ సెషన్లతో ఈ కార్యక్రమం నిండి ఉంటుంది. తమిళనాడులోని నిపుణులతో క్రాస్ సరిహద్దు ఆవిష్కరణ, అమెరికా, ఇతర దేశాలు రాష్ట్రంలో ప్రారంభ వాతావరణం గురించి చర్చించనున్నాయి.

ఒక ఆహ్లాదకరమైన మరియు అనధికారిక నేపథ్యంలో ప్రారంభాలు మరియు నెట్వర్కింగ్ పార్టీచే ఒక పిట్చ్ సెషన్ ఉంటుంది. గురువు సెషన్లు అభ్యాస అవకాశాలను అందిస్తాయి. జీటెన్ ఇతర ప్రాంతాల నుండి జీఐఎమ్ కు హాజరయ్యే వారికి ఉచితం. అనేక టై అధ్యాయాలు అది గొప్ప విజయాన్ని సాధించడంలో సహాయపడుతున్నాయి. 500 మంది ప్రతినిధులు హాజరు కావాలని భావిస్తున్నారు. టిఐఇఎస్వి వాలంటీర్లచే టిఎఇఓన్ సిలికాన్ వ్యాలీలో జీటెన్ ఏర్పడింది.

టైకాన్ సిలికాన్ వ్యాలీ సమయంలో 2017 నుండి ప్రతి సంవత్సరం జీ టెన్ఎస్వీ నిర్వహిస్తున్నారు. గత సంవత్సరం టైకాన్ హాజరైన ప్రపంచవ్యాప్తంగా నుండి తమిళ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ సమావేశం అవకాశం ఇచ్చింది. తమిళ ప్రజలు జీవిస్తున్న ఇతర దేశాలలో జీటెన్ జరగనుంది. బిటిఎస్, ఐఐటి మాద్రాస్, ఎన్ఐటి, ఇతర ఇంజనీరింగ్ కళాశాలలు వంటి పలు విశ్వవిద్యాలయాలు ఈ కార్యక్రమంలో పాల్గొంటాయని, జిటిఎన్ సహ వ్యవస్థాపకుల్లో ఒకరైన పద్దూ గోవిందారాజ్ చెప్పారు.

జీటెన్ చెన్నై ఆలోచన గత నెల తమిళనాడు ఐటి మంత్రి,మణికందన్ చర్చించారు మరియు సిలికాన్ వ్యాలీ లో జీఐఎమ్ రోడ్షో వద్ద ఇటీవల పరిశ్రమ మంత్రి, ఎం.సీ సంపత్, చర్చించారు.

సాస్ ప్రాంతంలో 50 ప్రారంభాల్లో చెన్నై భారతదేశం యొక్క సాస్ రాజధాని ప్రచారం, ఐటి ప్రారంభంలో దృష్టి ఉంటుంది. కానీ కనెక్ట్ వాహనాలు మరియు ఎలక్ట్రిక్ వాహనాలు,ఏఐమరియు ఇతర సాంకేతిక ప్రాంతాల్లో సెషన్లు ఉంటుంది. ఇప్పటికే, ఎలెక్ట్రిక్ బైక్లలో ప్రారంభమైన ఎస్‌వీఎమ్ బైక్లు పాల్గొనడానికి చాలా శ్రద్ధ కలిగివున్నాయి. సమావేశం స్థానిక అధ్యాయం ద్వారా ఉత్పత్తి అవుతుంది.

ప్రారంభ వృత్తంలో బాగా తెలిసిన డోరై థొడ్ల ప్యాక్కు నాయకత్వం వహిస్తోంది. జీ టెన్ యొక్క దృష్టి యువ, మహిళలు మరియు భారతదేశం మరియు మంచి వ్యాపార సహకారానికి ప్రపంచంలోని ఇతర భాగాలతో సంయుక్త లో మా కమ్యూనిటీ యొక్క ఉద్భవిస్తున్న వ్యవస్థాపకులు కనెక్ట్ ఉంది. ప్రపంచంలోని వేర్వేరు ప్రాంతాల్లో టిఈఎన్ఎవ్ల సమయంలో జి.టి.ఎన్స జరగనుంది. ఇది సాధారణ లక్షణంగా ఉంటుందని నరసింహన్ కస్తూరి చెప్పారు.

## భక్తిభావంతో మిలాన్- ఉన్- నబీ పర్వదినం



**రాజధాని వార్తలు, రాయపూడి :** ముస్లిం సోదరులకు దైవ సమానులు, అల్లాహ్ పంపిన దైవ దూతగా భావించే మహ్మద్ ప్రవక్త జన్మదినం భక్తి భావంతో జరిగింది. రాయపూడిలో ముస్లిం సోదరులు పవిత్ర జెండాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. పంజా సెంటర్ నుంచి గ్రామం మొత్తం పవిత్ర జెండాలతో ఊరేగారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని అన్ని మసీదులలో మిలాన్-ఉన్-నబీ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాజంలో స్నేహం ప్రేమ, శాంతి కరువై సామాజిక రుగ్మతలు రాజ్యమేలుతున్న రోజుల్లో అల్లాహ్ ప్రేరణతో దివ్య ఖురాన్‌ను మానవాళికి పరిచయం చేసిన మహనీయుడు మహ్మమ్మద్ ప్రవర్త అని కొనియాడారు. అన్ని కుల, మతాల ప్రజలు శాంతియుత వాతావరణంలో ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ముస్లిం ప్రవర్తలు సందేశమిచ్చారు.



### కాకుల ఉపవాసం..

కార్తీక పౌర్ణమి సందర్భంగా గుంటూరులో దాదాపు అన్ని మాంసం దుకాణాలు చాలా స్వల్పంగా విక్రయాలు జరిపాయి.. రోజూ పనికిరాని ముక్కలు సంతోషంగా భుజించే పరిసరాల్లోని కాకులు కార్తీక శుక్రవారం ఆశాభంగం చెందాయి.. నిరాశతో దిక్కులు చూస్తున్నాయి.

\- కిరణ్ కుమార్, గుంటూరు


## రాజధాని క్లాసిఫైడ్స్

### నివాస ప్లాట్లు

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

### ఇతరములు

ఓంశ్రీ సాయిరాం రిజిస్ట్రేషన్ కన్సల్‌టెన్సీ & సర్వీసెస్ అన్ని రకముల దస్తావేజులు, అగ్రిమెంట్లు వ్రాయబడును. స్టాంపులు అమ్మ బడును. అన్ని రకముల మోటారు వాహనములకు ఇన్సూరెన్స్ కట్టించు కొనబడును.
**పాపన చక్రవర్తి డాక్యుమెంట్ రైటర్**
ఫోన్ 9502424704, 08645 244992
సబ్ - రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురు, తుళ్లూరు

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**వెంకటపాలెం**
సాయిలాస్య రియల్‌ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సెల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : 95151 53939

### షాప్స్

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

**తుళ్ళూరు**
విజయలక్ష్మి జనరల్ స్టోర్స్
మీకు కావలసిన నాణ్యమైన నిత్యావసర వస్తువులు
ఫోన్ : 94414 11432

### హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్ : 0866-2475087

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద
డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

### విద్యా సంస్థలు

**ఐనవోలు**
విఐటీ-ఏపీ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2370444

**నీరుకొండ**
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2343000

### వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

\- మేనేజర్

ప్రకటనలకు సంప్రదించండి 7680994755


## సినీ నటి రమ్యశ్రీకి డాక్టరేట్ ప్రధానం

- నటనే కాకుండా సామాజిక సేవలకు అమరావతి నేషనల్ ఎక్సెలెన్సీ అవార్డు
- 9 భాషల్లో350 చిత్రాల్లో నటించిన రమ్యశ్రీ
- రమ్య హృదాలయ ఫౌండేషన్ ద్వారా మెడికల్ క్యాంపులు సేవా కార్యక్రమాలు



**విజయవాడ :** ప్రముఖ సినీ నటి రమ్యశ్రీకి నేషనల్ డీమ్డ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందించింది. సినీ నటిగా, దర్శక నిర్మాతగా ఆమె కళారంగానికి అందించిన సేవలతో పాటు నిరుపేద, వృద్ధ, నిరాశ్రయులకు అందించిన సేవలకు ఈ పురస్కారాన్ని అందించారు. అమెరికాకు చెందిన గ్లోబల్ క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఫిలాంత్రోపిక్ సొసైటీ రమ్యశ్రీకి అమరావతి నేషనల్ ఎక్సెలెన్సీ అవార్డు ప్రదానం చేశారు. విజయవాడలోని ఐలాపురం కన్వెన్షన్ హాల్ లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డు అందించారు. రమ్య హృదాలయ ఫౌండేషన్ ద్వారా పదేళ్ళ నుంచి యాచకుల నుంచి వ ృద్ధులు, వికలాంగుల వరకు అందరికీ రమ్యశ్రీ అందించిన సేవలను విశేషంగా అభినందించారు. సినీ నటిగా రాణిస్తూ, సామాజిక బాధ్యతగా రమ్యశ్రీ మెడికల్ క్యాంపులు, క్యాన్సర్ పై చైతన్యం, బీపీ, సుగర్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు వందల సంఖ్యలో నిర్వహించారు. రమ్య హృదయాల ఫౌండేషన్ రమ్యమైన హృదయంతో ఈ కార్యక్రమాలను నిర్వహించిందని కొనియాడారు. రమ్యశ్రీ 350 సినిమాలు, తెలుగు, కన్నడ, తమిళ, మళయాళం, ఒడిస్సీ, భోజ్ పురి, పంజాబీ భాషా చిత్రాల్లో నటించారు. ఆమె డైరెక్టర్, ప్రొడ్యూసర్ గా నిర్మించిన ఓ మల్లి సినిమాకు స్పెషల్ జ్యూరీ రాష్ట్ర నంది అవార్డులు రెండు వచ్చాయి. బెస్ట్ హీరోయిన్, బెస్ట్ డైరెక్టర్ గా ఆమె మన్ననలు పొందారు. కన్నడలో ఆర్యభట్ట చిత్రానికి నటిగా జాతీయ అవార్డు లభించింది. ఆమె సామాజిక సేవలకు మదర్ థెరెస్సా అవార్డు కూడా వచ్చింది. నటిగా మన్ననలు పొందడమే కాకుండా, సమాజ సేవా కార్యక్రమాలను నిర్వహించగలగడం తన పూర్వజన్మ సుకృతమని రమ్యశ్రీ పేర్కొన్నారు.

## ప్రత్యర్థులను కలవరపెడుతున్న తె.రా.స, మహా కూటమి ప్రచారాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించినట్లు చెప్పుకున్నా తె.రా.సా అధినేత పదికి పైగా మహాకూటమి పథకాలను తామూ చేస్తామని చెప్పడం అధికార పార్టీకి కలిసి వచ్చే అంశం కాదు. కాగా ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచనున్నట్లు కూడా ప్రకటించడం తె.రా.సా నాయకుల కలవరపాటుకు స్పష్టమైన నిదర్శనం. ముందస్తు ఎన్నికలు ప్రకటించబోయే ముందు ఎన్నికలు లాంచనప్రాయమే అని, తమ అధికారానికి తిరుగులేదనీ భావించిన తె.రా.సా అధినేత ఆందోళనకు గురి కావడం స్పష్టంగా కనిపిస్తోంది. ఆంధ్రా పెత్తనం ప్రస్తావిస్తూ కె.సి.ఆర్ చేస్తున్న ప్రసంగాలు ఎన్నికలలో విజయంపై ఉన్న అభద్రతా భావాన్ని స్పష్టంగా చూపెడుతున్నదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తె.రా.సా విజయంలో ఏ మాత్రం అనుమానం లేదని భావించిన మీడియా పరిశీలకులు కూడా తెలంగాణా భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నం తె.రా.సా భయాందోళనలను సూచిస్తున్నదని భావిస్తున్నారు. ఎన్నికల కోసం భావోద్రేకాలను వాడుకోవడం విరమించుకుంటే బాగుంటుందని విజ్ఞుల అభిప్రాయం. గెలుపు పై తమకు తాము ఊహించుకున్న ప్రపంచంలో విహరిస్తున్న మహాకూటమి నాయకులు సీట్ల సర్దుబాట్లలో నవ్వులపాలు కావలిసి వచ్చింది. ఎట్లాగో కూటమి ఉనికిని కాపాడడం గుద్దిలో మెల్ల. భావోద్రేకాలను పెంచే విషయంలో తె.రా.సా నాయకుల ప్రచారాల ప్రభావంపై కూటమి నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు.



వైద్య, విద్యా శాఖ, మైనార్టీ మంత్రి ఎండి ఫరూక్‌కు విజయవాడలో సన్మానిస్తున్న విజయవాడ ముస్లిం సంఘాలు




## 1992 డిసెంబరు 6

# ముందు రోజు ఏం జరిగింది?



**16వ శతాబ్దంలో నిర్మించిన బాబ్రీ మసీదును 1992 డిసెంబర్ 6న అతివాద హిందూ గుంపులు ధ్వంసం చేశాయి. 26 ఏళ్ల క్రితం అయోధ్యలో జరిగిన ఈ ఘటన తర్వాత చెలరేగిన అల్లర్లలో సుమారు 2 వేల మంది మరణించారు. ఆ విధ్వంసం జరగడానికి ఒక రోజు ముందు ఫొటోగ్రాఫర్ ప్రవీణ్ జైన్, హిందూ కార్యకర్తలు విధ్వంసానికి "డ్రెస్ రిహార్సల్"గా చెప్పుకునే కార్యక్రమానికి హాజరయ్యారు. నాటి చిత్రాలను ఆ రోజు జరిగిన ఘటనల క్రమాన్ని వివరించారు. అవి ఆయన మాటల్లోనే..**

పొగమంచుతో నిండిన డిసెంబర్ 4, 1992 సాయంత్రం నేను అయోధ్యకు చేరుకున్నాను. అప్పుడు నేను 'ద పయనీర్' వార్తాపత్రికకు బాబ్రీ మసీదు వద్దకు చేరుకున్న కరసేవకులు, హిందూ రాడికల్ నేతల ఫొటోలను తీసే అసైన్‌మెంట్‌పై ఉన్నాను. హిందూ జాతీయవాదాన్ని ప్రేరేపించేందుకు ఉద్దేశించిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్)కు చెందిన వేలాది మంది కార్యకర్తలు అప్పటికే అక్కడికి చేరుకుని ఉన్నారు. ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్న బీజేపీతో పాటు ఇతర హిందూ సంస్థలకు ఆరెస్సెస్ సైద్ధాంతిక మార్గదర్శిలాంటిది. హిందువుల దేవుడైన శ్రీరాముని జన్మస్థానంగా భావించే ఆ ప్రదేశంలో ఆలయాన్ని నిర్మించాలనేది వాళ్ల ఆలోచన. **అయితే మసీదును ముట్టుకోమని, కేవలం శిలాన్యాస్‌కు పరిమితమవుతామని వాళ్లు హామీ ఇచ్చారు.** నాకు పరిచయమున్న ఒక బీజేపీ ఎంపీ, డిసెంబర్ 5 ఉదయం బాబ్రీ మసీదు విధ్వంసానికి రిహార్సల్ జరగబోతున్నట్లు తెలిపారు. మీడియా వాళ్లెవరూ అక్కడికి రాకుండా చూడాలని నాకు మా పైవాళ్ల నుంచి ఆదేశం అందింది. కానీ నువ్వు నా స్నేహితుడివి కావడం వల్ల ఈ సమాచారం చెబుతున్నా" అన్నారు. అతని సూచన మేరకు నేను కూడా ఒక హిందూ కార్యకర్తలా కాషాయ అంగవస్త్రాన్ని కప్పుకుని, తలకు పట్టీ ధరించి, నా జాకెట్ మీద వాళ్లిచ్చిన ప్రత్యేక బ్యాడ్జీని ధరించాను. నన్ను మసీదుకు కొంత దూరంలో ఫుట్ బాల్ గ్రౌండ్ పరిమాణంలో ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లారు. అప్పటికే తలకు కాషాయ పట్టీలు, అంగవస్త్రాలు కప్పుకున్న వేలాది మంది హిందూ కార్యకర్తలు అక్కడ సమావేశమై ఉన్నారు. కొంతమంది ఆ ప్రాంతం చుట్టూ పహారా కాస్తున్నారు.'ఇలా అయితేనే నువ్వు రిహార్సల్‌కు సంబంధించిన ఫొటోలు తీసుకోగలవు. నాకు దగ్గరగా ఉండు. వాళ్లతో కలిసిపోయి, నువ్వు కూడా వాళ్ల లాగే నినాదాలు చేస్తూ ఉండు. అప్పుడే నువ్వు సురక్షితంగా ఉంటావు" అని నా మిత్రుడు చెప్పాడు. ఇంతలో ఓ బలిష్టమైన వ్యక్తి నా ఎదురుగా ప్రత్యక్షమయ్యాడు. నా కెమెరా వైపు చూపి, దాన్ని దూరంగా పెట్టేయమన్నాడు. నేను అతనికి నా బ్యాడ్జీ చూపి, మిగతా వాళ్లలాగే నినాదాలు చేయడం ప్రారంభించాను. దాంతో అతను సంతృప్తి చెంది, నన్ను కొంత దూరంగా ఉన్న ఓ గుంపు దగ్గరికి తీసుకెళ్లాడు.



### ముసుగు ధరించిన నేత

నేను నా కెమెరాతో కళ్లెదుట కనిపిస్తున్న విభ్రాంతికరమైన దృశ్యాలను ఫొటో తీయడం ప్రారంభించాను. పలుగులు, ఇనుపరాడ్లు, పారలు పట్టుకున్న అనేక మంది తమ ఎదురుగా ఉన్న పెద్ద మట్టిదిబ్బను కిందికి లాగడానికి ప్రయత్నిస్తున్నారు.

అక్కడ అంతా ఒక ప్రణాళిక ప్రకారం పద్ధతిగా జరుగుతోంది. వాళ్లు కేవలం వాలంటీర్లు కాదు, ఒక బిల్డింగ్‌ను కూలదోయడం ఎలాగో తెలిసిన ప్రొఫెషనల్స్. బాబ్రీ విధ్వంసంపై ప్రభుత్వం నియమించిన లిబర్హాన్ కమిషన్ ఈ విధంగా పేర్కొంది: "వివాదాస్పద కట్టడాన్ని ధ్వంసం చేయడానికి ముందే రిహార్సల్ జరిగినట్లు కమిషన్ ముందు వాంగ్మూలం ఇవ్వడం జరిగింది. కొన్ని ఫొటోలను కూడా కమిషన్ ముందు ఆన్ రికార్డు పెట్టడం జరిగింది. అయితే సరైన సాక్ష్యాలు లేకుండా మసీదు విధ్వంసం కోసం కరసేవకులకు శిక్షణ ఇచ్చారన్న నిర్ధారణకు రావడం మంచిది కాదు". నేను తీసిన ఫొటోలలో ఒక వ్యక్తి ముఖానికి కర్చీఫ్ కట్టుకుని, మట్టి దిబ్బను కూల్చడానికి ప్రయత్నిస్తున్న వాళ్లకు ఆదేశాలు ఇస్తున్నాడు. బహుశా అతను ఏదైనా మితవాద పార్టీకి చెందిన నేత కావచ్చు. అందువల్లే తానెవరైందీ కనిపించకుండా తన మొహాన్ని కర్చీఫ్ చాటున దాచుకుని ఉండొచ్చు. ఆ తర్వాత వాలంటీర్ల కేకలు, నినాదాల మధ్య మట్టిదిబ్బను విజయవంతంగా కూలదోసారు. నేను నా కెమెరాను నా జాకెట్ లో దాచుకుని, ఈ మొత్తం కార్యక్రమానికి ప్రత్యక్షసాక్షిగా నిలిచానన్న ఉత్సాహం, ఆ ఫొటోలను భవిష్యత్ తరాలకు అందిస్తున్నాన్న ఆనందంతో, మిగతా వాళ్లతో పాటు నినాదాలు చేస్తూ అక్కడి నుంచి బయటపడ్డాను. ఆ మరుసటి రోజు నేను ఇతర జర్నలిస్టులతో కలిసి మసీదు ఎదురుగా ఉండే ఓ బిల్డింగ్ నాలుగో అంతస్తుపై ఏర్పాటు చేసిన వేదికపై కూర్చున్నాను. మా ఎదురుగా బీజేపీ, వీహెచ్‌పీ నేతల ఆధ్వర్యంలో కనీసం 1,50,000 మంది వాలంటీర్లతో ర్యాలీ జరుగుతోంది.

ఆ ప్రదేశానికి కాపలాగా ఉన్న పోలీసులు కూడా నినాదాలు చేస్తున్నారు. మిట్టమధ్యాహ్నం గడిచిన కొద్ది సేపటికి, అక్కడున్న గుంపులో ఉద్రేకం హెచ్చింది. ఆ గుంపు పోలీసులపైకి, మసీదును కాపలా కాస్తున్న వారిపైకి దూసుకెళ్లింది. కొంతమంది నాలుగో అంతస్తు పైకెక్కి జర్నలిస్టులపై దాడి చేసారు. కెమెరాలను విరగ్గొట్టి, మసీదు కూల్చివేతకు ఎలాంటి సాక్ష్యాలు లేకుండా చేయడానికి ప్రయత్నించారు. కొన్ని గంటల వ్యవధిలో అక్కడ మసీదు నేలకూలింది. నేను వీలైనంత వేగంగా అక్కడి నుంచి బయటపడి నా హొటల్ వైపు పరుగుతీశాను. అప్పటికే అల్లర్లు ప్రారంభమయ్యాయి. నేను పోలీసుల కోసం చుట్టూ చూశాను. కానీ అప్పటికే దుకాణాలు, ఇళ్ల తలుపులు మూతపడడం ప్రారంభమైంది. **మసీదును కూలదోసిన ఆ రోజు, ఒక హిందువుగా నేను చాలా సిగ్గుపడ్డాను.** లిబర్హాన్ కమిషన్ ముందు నేను కూడా సాక్ష్యం ఇచ్చాను. మసీదు కూల్చివేతకు సంబంధించి ఇప్పటికీ స్పెషల్ కోర్టు ఎదురుగా ఒక సాక్షిగా హాజరవుతుంటాను. మసీదు కూల్చివేసి 26 ఏళ్లు గడిచిపోయాయి. కానీ దానికి కారణమైన వారెవ్వరికీ ఇప్పటివరకు శిక్ష పడలేదు.



**(బీబీసీ సౌజన్యంతో...)**

**– బోస్**



ప్రవీణ్ జైన్ ఇప్పుడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అసోసియేట్ ఎడిటర్‌గా ఉన్నారు. అత్యంత ధైర్యసాహసాలతో దేశంలో జరిగిన ఎన్నో దురాగతాలను ఆయన తన ఫొటోల ద్వారా ప్రపంచానికి తెలియచేశారు. ప్రింట్ మీడియా బలంగా ఉన్న ఆరోజుల్లో సాహసోపేతమైన ఫొటోలు తీసినవారిలో ఆయన ముందున్నారు. 1980ల్లో ఆయన అరుదైన ఫొటోలు తీసి హీరోగా మారారు. రాజీవ్‌గాంధీ హయాంలో హషింపురలో ముస్లింలను ఊచకోత కోతకు సంబంధించిన ఫొటోలను ఆయన ప్రాణాలను ఫణంగా పెట్టి తీశారు. ఆ దురాగతం ప్రవీణ్‌జైన్ ఫొటోలవల్లే ప్రపంచాని తెలిసింది. మీరట్‌లో జరిగి మతదాడులను కవర్ చేసేందుకు వెళ్లి పోలీసు పోస్టుల వద్ద నిలబడగా, హషింపూర పేరు వినిపించింది. అక్కడ ఏదో జరుగుతుందని ఊహించి వెళ్లిన జైన్ హుటాహుటిన అక్కడకు చేరుకోగానే,ఆర్మీ, ఉత్తరప్రదేశ్ పోలీసుల, భద్రతాదళాలు అక్కడి ముస్లింలను ఇళ్ల నుంచి బయటికి లాగి తుపాకులతో కొట్టుకుంటూ తీసుకు వెళ్లడం కనిపించింది. తమకొడుకులు, భర్తల కోసం మహిళలు ఏడ్చుకుంటూ వారిని ప్రాధేయపడినా కనికరించని కర్కశత్వాన్ని ఆయన తన ఫొటోలతో బయటి ప్రపంచానికి చూపించారు. కాశ్మీర్,పంజాబ్, గుజరాత్ ఇంకా ఉత్తర భారత దేశంలో అనేక చోట్ల జరిగిన దాడులకు ప్రత్యక్ష సాక్షిగా ఆయన సుప్రీంకోర్టుకు హాజరవుతున్నారు కూడా.. తన సాక్ష్యంతో 30 ఏళ్లతర్వాత హాషిపూర నిందితులకు శిక్ష పడటం ఆయనకు సంతోషం కలిగించేదే అయినా గుజరాత్ అల్లర్లలో నిందితులు తప్పించుకోవడం బాధాకరమంటారు..




# ఆర్బీఐకి ఆద్యుడు అంబేద్కర్

**దేశం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుండగా,రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. దాని స్వతంత్రతను దెబ్బతీసి, పెత్తనం దక్కించుకునేందుకు ప్రధాని మోడీ పథక రచనలు చేస్తున్నారు. ఇందులోని రిజర్వు నగదును కైవసం చేసుకునేందుకే ఎన్‌డీఏ ప్రభుత్వం బోర్డు నియామకాన్ని చేపట్టింది. ఎన్నికల దృష్యా అది మరింత వివాదాస్పదమవుతుందని తాత్కాలికంగా బోర్డు ప్రతిపాదనను పక్కన పెట్టింది. ఈ క్లిష్ట సమయంలో అసలు ఆర్బీఐకి ప్రాణప్రతిష్ట ఎవరు చేశారని తెలుసుకుందాం..**

మొదట రూపాయి అనే పేరు పెట్టింది షేర్షా (1540-45) అనే ముస్లీం చక్రవర్తి. డాక్టర్ అంబేద్కర్ 1915లో " **ఏన్షియన్ట్ ఇండియన్ కామర్స్**" అనే సిద్ధాంత గ్రంధాన్ని, 1916 లో" **నేషనల్ డివిడెండ్ ఆఫ్ ఇండియా - ఎ హిస్టారిక్ అండ్ ఎనలిటికల్ స్టడీ**" అనే పుస్తకం రాయటం ద్వారా పీహెచ్‌డి పొందారు. 1920 లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ద్వారా డీఎస్సీ , పొందారు...1923 లో

**"ద ప్రోబ్లమ్ ఆఫ్ రూపీ, ఇట్స్ ఆరిజన్ అండ్ సోల్యుషన్స్"** పుస్తకం రాసారు. డాక్టర్ అంబేద్కర్ చేసిన ప్రతిపాదనల వల్లే ఆర్బీఐ 1935 లో ఏర్పడింది. అందుకు ఖచ్చితంగా కరెన్సీ మీద అంబేద్కర్ చిత్రపటాన్ని వెయ్యాలి. అలా చెయ్యకపోవటం ...ఆధిపత్య కులాల కుట్ర.**"ద ప్రోబ్లమ్ ఆఫ్ రూపీ, ఆరిజన్ అండ్ సోల్యుషన్స్ "** అనే గ్రంథం అధారంగా ఆర్బీఐని స్థాపించడానికి బ్రిటీషు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హిల్టన్యగ్ కమీషన్ ముందు ఆర్.బి.ఐ. విధి, విధానాలు, పనితీరు, అడ్మినిస్ట్రేషన్ అన్నీ రూపొందించి అంబేద్కర్ ప్రవేశపెడితే కమీషన్లోని సభ్యులందరు దాన్ని ఏకాభిప్రాయంతో ఆమెదించారు....ఇది **"రాయల్ కమిషన్ ఆఫ్ ఇండియన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్"**గా ఆమెదించబడి బయటకు వచ్చింది. 1934 ఆర్బీఐ బిల్లును శాసనసభలో ప్రమేశపెట్టే సమయంలో కమిషన్ లోని సభ్యుల ప్రతి ఒక్కరి చేతిలో అంబేద్కర్ రాసిన **"ద ప్రోబ్లమ్ ఆఫ్ రూపీ, ఆరిజన్ అండ్ సోల్యుషన్స్ "** గ్రంథం దర్శనిమిచ్చిందంటే దీని రూపకల్పన లో అంబేద్కర్ పాత్ర ఎంతుందో అర్థం చేసుకోవచ్చు. ద ప్రోబ్లమ్ ఆఫ్ రూపీ అనే అంబేద్కర్ థీసిస్ ఆధారంగా బ్రిటిష్ ప్రభుత్వం 1935 ఆర్బీఐని రిజర్వు బ్యాంకు అఫ్ యునైటెడ్ స్టేట్స్ అఫ్ అమెరికా మోడల్ లో పెట్టాలని ఆలోచన చేసింది..ఆ సమావేశానికి అక్కడ ప్రతినిధులు కూడా వచ్చినప్పుడు అందరూ అయన థీసిస్‌ని చేత్తో పట్టుకు సభకు హాజరు అయ్యారు.దక్షిణ ఆసియాలోనే మొట్ట మొదట అర్ధ శాస్త్రంలో పీహెచ్‌డి చేసిన మేధావి వ్యక్తి బాబా సాహెబ్ డా. బి.ఆర్.అంబేద్కర్.భారత దేశంలో ఆర్బీఐ స్థాపనకి కారణమైన వ్యక్తి, ఉన్నత విద్యావంతుడు,దార్శనికుడు,మేధావి ,ఆధునిక భారత పితామహుడు.. బాబా సాహెబ్ డా. బి.ఆర్.అంబేద్కర్. ది ప్రాబ్లేమ్ ఆఫ్ రూపీ ఇట్స్ ఆరిజన్ అండ్ సోల్యూషన్ పై,1926లో,ఫాధర్ ఆఫ్, మోడ్రన్ ఎకనామిక్స్, జె.ఎమ్. కీనీస్ ద జనరల్ ఆఫ్ ది రాయల్ ఎకానమిక్స్ సోసైటీలో వాల్యూమ్ 35లో 5 పేజీల రివ్యూ వచ్చింది. కానీ కరెన్సీ నోట్లపై ఆయన చిత్రం ముద్రింప బడలేదు. ఒక ప్రపంచ మేథావిని, గొప్ప వ్యక్తిని విస్మరించటం మన వ్యవస్థ లోపం కాదా..ఇకనైనా మనువాద పార్టీల కుట్రలను మనం గ్రహించాల్సిన అవసరం ఉంది.లేకుంటే మన తప్పిదాలకి భారీ మూల్యాన్ని చెల్లించు కోవాల్సిన పరిస్థితి దాపురిస్తుంది....ఇప్పుడు చెప్పండి కరెన్సీ నోట్ల మీద ఫోటో ముద్రించ బడటానికి నిజమైన అర్హులు ....ఎవరు ?

### బాబాసాహెబ్ ప్రత్యేకతలు

బాబాసాహెబ్ తన జీవిత కాలంలో 527 ప్రసంగాలు చేసారు,ప్రతి ప్రసంగం అత్యంత ప్రభావితం చేయగలిగేవే. లండన్ యూనివర్సిటీ లైబ్రరీలో ఉన్న పుస్తకాలు మొత్తం చదివి అవపోసన పట్టిన ఒకే ఒక్కడు బాబాసాహెబ్.




### దేశ ఆర్థిక పితామహుడు: అమర్త్యసేన్



నా దృష్టిలో అంబేద్కర్ ఆర్థిక పితామహుడు. అణగారిన వర్గాలకు ఆర్థిక చేయూత నివ్వండంలో ఆయనను మించిన వారు లేరు. ఆర్థిక రంగం ఆయనకు కొట్టిన పిండి. ఆయన మరింత పేరుప్రఖ్యాతులు పొందడానికి అర్హుడు. దేశ ఆర్థిక వ్యవస్థలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం.

ప్రపంచంలో అత్యధిక విగ్రహాలు గల ప్రజా నాయకుడు బాబాసాహెబ్. ప్రపంచ చరిత్రలో అత్యంత ప్రభావశీలురైన 6గురు మేధావులలో ఆయన ఒకరు. లండన్ విశ్వవిద్యాలయంలో తన ఎనిమిదేళ్ళ చదువుని మూడు సంవత్సరాలలో పూర్తి చేసిన అత్యంత మేధావి. తన ప్రమేయం లేదు కాబట్టి హిందూమతంలో పుట్టాను గానీ హిందూమతంలో మాత్రం చావను అని ఆయన బౌద్ధం తీసుకుంటే, మరో ఆలోచన లేకుండా 5లక్షల మంది బౌద్ధం తీసుకున్నారు.. ఇంతటి అభిమానం ఇంకే నాయకుడు పొంది ఉండడు.

### అరుదైన గౌరవాలు

భారత రత్న - ఇంత ప్రపంచ మేధావికి స్వతంత్ర్యం వచ్చిన 43 ఏళ్ళకు గానీ గుర్తించలేకపోయింది. కులం రోగంతో కొట్టుకుంటున్న భారత ప్రభుత్వం. యావత్ ప్రపంచం బాబాసాహెబ్ ను నవభారత నిర్మాతగా,భారతదేశ చరిత్రలో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చిన ఒక అత్యంత ప్రభావశీలుడైన నాయకునిగా గుర్తిస్తుంటే,భారతదేశంలో మాత్రం ఆయనను ఒక కులానికి నాయకునిగా,ఒక వర్గానికి నాయకుడిగా చూస్తోంది.సంఘ్ విద్రోహులు బాబాసాహెబ్ అందరి నాయకుడు అంటూనే ఆయన గొప్పదనం తెలియజేయకుండా కేవలం ఆయనను రాజ్యాంగ రచయితగా మాత్రమే పరిమితం చేసి, హిందూ మత ఉద్ధారకునిగా ప్రచారం చేస్తూ హిందూ ఓటు బ్యాంకు పెంచుకోవాలని కుతంత్రం చేపట్టింది.ఇది బాబాసాహెబ్ ఆలోచన విధానాన్ని పూర్తిగా తుడిచి పెట్టే కుట్ర.

### అంబేద్కర్ ప్రతిభకు అమెరికా గుర్తింపు

మన విశ్వవిద్యాలయంలో చదివి వెళ్లిన పూర్వ విద్యార్థి, భారత రాజ్యాంగాన్ని రచించడం అనే మహోత్కృష్ట కార్యాన్ని చేయడం, మనకు గర్వ కారణం. కొలంబియా విశ్వవిద్యాలయం స్థాపించి 300 సంవత్సరాలు అయిన సందర్భంగా మన విశ్వవిద్యాలయపు అత్యంత ప్రతిభాశాలి అయిన విద్యార్థులెవరు, అని సర్వే నిర్వహించాం. అందులో ఆరుగురి పేర్లు ప్రముఖులుగా రాగా అందులో నెంబర్ 1 స్థానంలో అంబేద్కర్ పేరు వచ్చింది. బాబా సాహెబ్ గారి గౌరవార్థం ఆ కొలంబియా విశ్వవిద్యాలయపు ముఖద్వారం వద్ద ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారు. విగ్రహావిష్కరణ అప్పటి అమెరికా అధ్యక్షుడు బారక్ ఒబామా గారి చేతుల మీదుగా జరిపారు. ఆ విగ్రహం కింద ఈ క్రింది విధం గా రాశారు.



**సింబల్ ఆఫ్ నాలెడ్జ్ (జ్ఞానానికి ప్రతీక )**

**చాయ్ అమ్ముకునే మోడీ, ప్రధాని అయ్యాడని అందరూ అన్నీ చెప్పారు. క్లాస్ రూమ్ బయట కూర్చొని చదివిన దళిత బాలుడు డా।। బి ఆర్ అంబేద్కర్, ఈ దేశ శిల్పి, రాజ్యాంగ నిర్మాత అయ్యాడని. జ్ఞానానికి ప్రతీక అయ్యేడని మాత్రం దేశంలో ఎవరూ చెప్పలేదు.**

**– ఖాన్**

### అంబేద్కర్ విద్యార్హతల్లో కొన్ని



- మెట్రిక్యులేషన్ -1908
- బి.ఎ (పొలిటికల్ అండ్ ఎకనామిక్స్) ముంబై యూనివర్సిటీ 1912 అంటబడని కులాల నుండి మొట్టమొదటి గ్రాడ్యుయేట్
- ఎం.ఏ (ఎకనామిక్స్-ప్రాచీన భారత వాణిజ్యంపై థీసిస్) అమెరికా 1915
- పి. హెచ్‌డీ (ఎకనామిక్స్) (బ్రిటీషుపాలనలో ఆర్థిక పరిణామం)కొలంబియా వర్సిటీ (అమెరికా) 1917 ఆర్థిక శాస్త్రంలో ఆసియా ఖండం నుంచి ప్రథమ డాక్టరేట్
- డి.ఎస్సీ ( రూపాయి సమస్యలు -దాని పుట్టుపూర్వోత్తరాలు, పరిష్కార మార్గాలు) లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ 1923 ఆర్థిక శాస్త్రంలో డి.ఎస్సీ తీసుకున్న మొదటి, చివరి భారతీయుడు
- ఎం.ఎస్.సీ (ఎనామిక్స్‌లో బ్రిటీషు పాలనా భారతదేశంలో ఆర్థిక వికేంద్రీకరణ థీసిస్) లండన్‌లో ఆర్థిక శాస్త్రంలో మొదటి డబుల్ డాక్టరేట్
- బార్ ఎట్ లా : లండన్ గ్రే ఇన్ లో 1923 మొదటి ప్రపంచ న్యాయవాది
- పొలిటికల్ ఎకనామిక్స్ - జర్మనీ
- ఎల్.ఎల్.డి (ఆనరీస్) కొలంబియా వర్సిటీ, న్యూయార్క్ (భారత రాజ్యాంగాన్ని నిర్మించడంలో) ఆయనకు ఇచ్చిన గౌరవం
- డి.లిట్ (ఆనరీస్) ఉస్మానియా వర్సిటీ హైదరాబాద్ (భారతరాజ్యాంగానికి ఆయన ఇచ్చిన గౌరవం)

బాబాసాహెబ్ తన జీవిత కాలంలో 20,000 పుస్తకాలు సేకరించారు., అమెరికా నుండి తిరిగి వచ్చే సమయంలో ఆయన పుస్తకాలు తీసుకొస్తున్న నౌకను జర్మనీ సబ్ మెరైన్ దాడి చేసి ముంచేయడంతో దాదాపు 6000 పుస్తకాలు పోగొట్టుకున్నారు,ఆ సమయంలో బాబాసాహెబ్ చాలా బాధ పడ్డారు. మరాఠీ, హిందీ, ఇంగ్లీషు, గుజరాతీ పాళీ (- పాళీ వ్యాకరణం మరియు నిఘంటువు కూడా రాసారు ) సంస్కృతం, జర్మన్, పార్శీ, ఫ్రెంచ్ తొమ్మిది భాషల్లో బాబాసాహబ్ పూర్తి ప్రావీణ్యత కలిగి ఉన్నారు.

## అసమానతలపై ఉక్కుపాదం

### అంబేద్కర్ సంపాదకీయత్వం

అంబేద్కర్ రాజ్యాంగ రూపశిల్పి, బహుముఖ ప్రజ్ఞాశాలి, సమసమాజ వైతాళికుడు.. చాలా మందికి తెలియని కోణం ఏమిటంటే అంబేద్కర్ మంచి పాత్రికేయుడు, సంపాదకుడు కూడా. మూక్‌నాయక్, బహిష్కృత్ భారత్, జనతా, ప్రబుద్ధ భారత్ వంటి పత్రికలను నడిపి ప్రజల్లో చైతన్యం కలిగించాడు. ఆంగ్లంలో అద్భుతమైన పాండిత్యం గల అంబేద్కర్.. పాత్రికేయుడిగా మాత్రం అచ్చమైన మరాఠీలో తన భావాలను ప్రతిభావంతంగా వెలిబుచ్చేవారు. 1920లో అంబేద్కర్ పత్రికా ప్రపంచంలోకి అడుగుపెట్టారు. ఆయన పెట్టిన తొలి వార్తాపత్రిక.. మూక్‌నాయక్. ఆ ఏడాది జనవరి 31న ప్రారంభమైన ఆ పక్ష పత్రిక మూడేళ్లపాటు నడిచి మూతపడింది. తర్వాత 1927 నుంచి 1929 దాకా 'బహిష్కృత్ భారత్', 1930 నుంచి 1956 దాకా 'జనతా' పత్రికలను నడిపారు. 1956లో 'ప్రబుద్ధ భారత్'ను ప్రారంభించారు. ఆయన భావాల్లో పాండిత్యం ఉన్నా.. భాష సరళంగా ఉండి అందరికీ అర్థమయ్యేలా ఉండడం, మరాఠీపై పట్టు చదువరులపై గొప్ప ప్రభావం చూపేవి. నిజానికి ఆంగ్ల మాధ్యమంలో చదవడం వల్ల తొలినాళ్లలో ఆయనకు మరాఠీపై పట్టు అంతంత మాత్రంగానే ఉండేది. దీన్ని అధిగమించేందుకు తొలుత తన వ్యాసాలను ఆంగ్లంలో రాసుకుని వాటిని మరాఠీలోకి అనువదించుకునేవారని రత్నాకర్ గణ్‌వీర్ అనే రచయిత పేర్కొన్నారు. అంబేద్కర్ భావాలు ఎంత గొప్పవైనా.. తగినన్ని నిధులు లేకపోవడం వల్లనే తొలి రెండు పత్రికలూ (మూక్ నాయక్, బహిష్కృత్ భారత్) త్వరగా మూతపడ్డాయి. నిధులు లేకపోవడానికి కారణం.. మళ్లీ ఆయన ఉదాత్తమైన ఆశయాలు, గొప్పభావాలే! అదెలాగంటే.. బాంబే క్రానికల్, కేసరి వంటి పత్రికల్లో వచ్చే బాధ్యతారహితమైన వాణిజ్యప్రకటనలను, మతపరమైన సాహిత్యాన్ని ఒకసారి ఆయన తన బహిష్కృత్ భారత్ పత్రిక సంపాదకీయంలో కడిగిపారేశారు. అసమానత్వాన్ని, కర్మకాండలను గొప్పగా చూపే వాణిజ్యప్రకటనలను దునుమాడారు. అనైతికమైన, నీచమైన అలాంటి ప్రకటనలను తన పత్రికలో అనుమతించడం కన్నా.. ఎలాంటి వాణిజ్యప్రకటనలూ లేకుండానే తన పత్రికను ప్రచురిస్తానని తేల్చిచెప్పారు. బహిష్కృత భారత్ పక్ష పత్రిక మహాడ్ ఉద్యమంలో కీలకపాత్ర పోషించింది. సమాజంలో కులపరమైన హింసకు వ్యతిరేకంగా అభిప్రాయాన్ని కూడగట్టడంలో ప్రధాన పాత్ర వహించింది. ఆ పత్రికలో అంబేద్కర్ రాసిన సంపాదకీయాలను దళితులు కూడిన ప్రతి చోటా బహిరంగంగా పెద్దగా చదివి వారిలో చైతన్యం పెంచేవారు. తగినన్ని ఆర్థిక వనరులు లేకపోవడంతో ఆ పత్రికను అంబేద్కర్ అంతా తానై నడిపారు. రిపోర్టింగ్ చేసి కథనాలు రాసి, సంపాదకీయం కూడా తానే రాసి ప్రచురించేవారు. చివరికి ఆ పత్రిక కూడా ఆర్థిక కారణాలతోనే మూతపడింది.




### హిందూ ముస్లిం వివాహం రగడ..

1927లో.. మహారాష్ట్రలో ఒక హిందూ ప్రముఖుడు,ప్రముఖ వ్యాపారవేత్త వాడియా మనవరాలు రతన్ బాయ్ పండిట్, మహ్మద్ అలీ జిన్నాను పెళ్లి చేసుకోవడం సంచలనం సృష్టించింది. ఆ పెళ్లిని ప్రముఖ మరాఠా పత్రికలన్నీ వ్యతిరేకించగా అంబేద్కర్ ఒక్కరే సమర్థించారు. అలాంటి మతాంతర వివాహాలు హిందూముస్లింల మధ్య విశ్వాసాన్ని పెంచుతాయని తన సంపాదకీయంలో రాశారు. పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తుల వ్యక్తిగత విషయమని.. దాంట్లో ఇతరులకు ఎలాంటి పాత్రా లేదని తేల్చిచెప్పారు. ఇలా పలు సామాజిక అంశాలపై బాబాసాహెబ్ తన సంపాదకీయంలో చెరగని ముద్ర వేశారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com